W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక






భద్రాద్రి కొత్తగూడెం

5-7-2025



07

## మాజీ మంత్రి పువ్వాడను పరామర్శించిన కేటీఆర్, హరీష్‌రావు

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో పరామర్శిం చారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల ను అడిగి తెలుసుకున్నారు. అజయ్ కుమార్ వైరల్ ఫీవర్‌తో కొద్దిరోజులుగా బాధపడుతూ ఆస్పత్రిలో చేరినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన వద్దకు వెళ్లి కేటీఆర్, హరీష్ రావు పరామ ర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పువ్వాడ ఖమ్మంలో మంత్రిగా చక్రం తిప్పారు.



09

## నీటిలో ముగిసిన రెండు కలలు

- ఒక్క క్షణం... ఇద్దరి జీవితానికి ముగింపు
- విషాదాన్ని మోసుకొచ్చిన మున్నేరు ప్రవాహం
- శుభ్రం చేసిన బైకు... మలినమైన భవితవ్యాలు
- కన్నీటి వాల్మీకి అయిన ఊరి నది

ఒక చిన్న అనుకోని పనికి బయలుదేరిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు నదిలో మునిగి మృతిచెందిన విషాద ఘటన శుక్రవారం చింతకాని మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. నిత్యజీవితంలో సాదాసీదాగా కనిపించే నదితీరాలు ఒక్కసారిగా కన్నీటి మయమయ్యాయి. ఒక్క క్షణంలో మూడు కుటుంబాల్లో వెలుగులు చీకట్లోకి మసకబారిపోయాయి.



09

# సిద్ధు బాయ్ మాటే శాసనం!

## పట్టాల పేరిట కోట్లకు పడగలెత్తిన దందా

- ఒకే ప్లాట్ మూడుసార్లు అమ్మిన మాఫియా
- నాయకుడి అండతో న్యాయంగా మారిన నేరాలు
- పల్లెతల్లి చెంత ఫంక్షన్ హాల్ - బినామీ సొమ్ములో పుష్కల విలాసం
- పదేపదే మారే పార్టీలు -మారని దోపిడీ తంతు!
- ఇది పువ్వాడ ఉదయ నగర్ లో జరుగుతున్న అక్రమాల తంతు

ఖమ్మం, మహా

పట్టాల పథకాల పేరిట పేదలకు ఇచ్చిన భూములు నేడు అధికార, రాజకీయ గద్దల కింద పడిపోయి, 'ప్లాట్ పాపాల' నిలయంగా మారిన ఖమ్మం నగర శివార్లలోని పువ్వాడ ఉదయ్‌నగర్ ఉదంతం - సమకాలీన ప్రజాస్వామ్యంలో భయపెంచే నిజం. ఒకపక్క పేద ప్రజలు తమ హక్కుల కోసం నిలబడితే -మరోపక్క రాజకీయ నేతలు, అధికారిక ముఠాలు పక్కదారి పట్టించి కోట్లు మాయ చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, పట్టాలు, ఇళ్ల పంపకాలు, రిజిస్ట్రేషన్ మాయాలు, బినామీల సంపాదనలు, మీడియా మౌన వాహనత్వం, అధికారుల కలయిక - అన్నీ కలిసి ఒక్క గ్రామాన్ని నేరాల వేదికగా మార్చాయి. ప్రశ్నిస్తే దాడులు... నిజాలు వెలికి తీయాలంటే ప్రాణాల బెదిరింపులు - ఇక్కడి ప్రజలు ఇప్పుడు జీవిస్తున్నది ప్రజాస్వామ్యంలో కాదు... కుట్రాస్వామ్యంలో అని చెప్పవచ్చు.

### ప్రజల కన్నీటి మీద పెంచిన విల్లాలు

ఒకప్పుడు సెంట్రింగ్ పనులు చేస్తూ జీవించిన ఓ మాజీ సర్పంచ్ భర్త - నేడు విలాసవంతమైన రెండు అంతస్తుల బంగ్లా, సియాజ్ కారు, లక్షల విలువ చేసే బ్రీడ్ కుక్కలతో జీవనం గడుపుతున్న వైనం నిజానికి ప్రజల కడుపునీ కల్లోలపరిచే విషాదం. ఇవన్నీ బినామీల పేరిట రిజిస్ట్రేషన్‌లు, ఖమ్మం-హైదరాబాద్ రహదారిపై ఇళ్ల కొనుగోళ్లు, మమత ఆసుపత్రి పక్కన ఖరీదైన ప్రాపర్టీలు, ఫంక్షన్ హాల్స్ ద్వారా ధన ప్రదర్శనగా మారాయి.

### ఒక్కో ప్లాట్ రెండు సార్లు

ప్రభుత్వ పట్టాలు ఉన్న చోట... అధికారులు, స్థానిక నాయకులు కలసుకొని ఒకే ప్లాట్‌ను రెండు నుంచి మూడు సార్లు అమ్మే ఘాతుకాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్క ప్లాట్‌కు రూ. 2 లక్షల నుంచి రూ. 6 లక్షల దాకా ధర పెట్టి - అసైన్డ్ భూమిని కార్పొరేట్ కమర్షియల్ టౌన్‌షిప్‌లా మార్చిన దుర్ఘటన ఇది. ఫలితంగా అధికారికంగా ఇప్పటివరకు కేవలం 515 ఇళ్లకే పన్ను చెల్లింపులు జరుగుతున్నాయి. మొత్తం వసూలు రూ. 2,35,551 మాత్రమే.



09

## ఘోర రోడ్డు ప్రమాదం

### ముగ్గురు దుర్మరణం

ఖమ్మం-వరంగల్ హైవేపై తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాలను శోకసాగరంలో ముంచింది. అర్ధరాత్రి నిద్రను భంగం చేస్తూ ఆ రోడ్డుపై ఒక్కసారిగా అగ్నికీలలు చెలరేగాయి. భారీ వేగంతో దూసుకొచ్చిన రెండు లారీలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. వారిలో ఇద్దరు లారీ డ్రైవర్లు కాగా, ఒకరు క్లీనర్. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య తాడాడుతున్నారు.

FOLLOW: @ANNTELUGU
5-7-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# వరద విపత్తుల నిర్వహణకు సన్నద్ధం

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, మహా:** వరద విపత్తుల నిర్వహణకు పూర్తి స్థాయి లో సన్నద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఎన్.డి.ఎం.ఏ. జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్, అడ్మినిస్ట్రేషన్ అండర్ సెక్రటరీ అభిషేక్ బిశ్వాస్, డి.ఎం. కన్సల్టెంట్ డాక్టర్ వజీం ఇక్బాల్, తెలంగాణ రాష్ట్ర డిస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ కన్సల్టెంట్ గౌతం కృష్ణ తేజ, బి. అనుపమ, టి.జె. సంద్ర, సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీ సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం వచ్చిన భారీ వరదలు, విపత్తుల నిర్వహణ కోసం జిల్లాలో చేసిన ఏర్పాట్లు, ప్రణాళిక తదితర అంశాలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విపత్తుల సమయంలో రెవెన్యూ, నీటి పారుదల, మున్సిపల్, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక శాఖలు వారి పరిధిలో చేపట్టిన పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గత ఏడాది 24 గంటల వ్యవధిలో ఖమ్మం నగర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరదలు వచ్చాయని, మున్నేరు నదీ పరివాహక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయని, తిరుమలాయపాలెం మండలంలో రాకాసితండా, అజ్మీరా తండలో 150 మందిని ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలు సంరక్షించాల్సి వచ్చిందని అన్నారు. గత ఏడాది వరదలలో ఆరుగురు చని పోయారని కలెక్టర్ తెలిపారు. ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఇంటికి 10 వేల రూపాయల చొప్పున సహాయం అందించిందని, భారీ ఎత్తున పశు సంపద కూడా నష్టం జరిగిందని అన్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తు పనులు చేపట్టామని అన్నారు. ప్రస్తుత సంవత్సరం వరద విపత్తు నిర్వహణకు మరింత పకడ్బందీగా సన్నద్ధం అయ్యామని, నీటి వనరుల, వర్షాభావ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నామని, వరద ఉధృతి అంచనాలను సమర్ధవంతంగా తెలుసుకుంటూ, విపత్కర పరిస్థితుల్లో ముంపు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వేగవంతంగా తరలించేందుకు రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులు, ఆపద మిత్ర వాలంటీర్లను సన్నద్ధం చేశామని అన్నారు. విపత్తు సమయంలో రెస్క్యూ ఆపరేషన్ ఆస్కారం లేకుండా ముందుగానే ప్రజలను తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. వరదల ఉధృతి ఆధారంగా ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తూ, ఏ స్థాయిలో నీరు వస్తే ఏ ప్రాంతాల ప్రజలను తరలించాలో ఎస్.ఓ.పి. తయారు చేసుకున్నామని తెలిపారు. వరద విపత్తు సమయంలో సహాయం కోసం ప్రజలు నేరుగా సంప్రదించేందుకు కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 300 పైగా ఆపద మిత్రలకు, స్థానిక కార్పోరేటర్ లు, ప్రజా ప్రతినిధులకు డిజాస్టర్ మేనేజ్మెంట్ పై అవగాహన కల్పించామని అన్నారు. వరద రాకముందే యుద్ధ ప్రాతిపదికన లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపుకు చర్యలు చేపట్టామని, వరద ప్రభావిత ప్రాంతాలలో ఆపద మిత్రలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. జిల్లాలో నీటి వనరుల్లో 75 శాతం మాత్రమే నిండి ఉండేలా చూస్తున్నామని, ఎక్కడా చెరువు కట్టలు కొట్టుకొని పోకుండా చూస్తున్నామని అన్నారు. సమావేశంలో ఎన్.డి.ఎం.ఏ. జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్ మాట్లాడుతూ నీటి వనరులు, చెరువులు, చెక్ డ్యాంల వద్ద అవసరమైన చోట పూడికతీత పనులు చేపట్టాలని అన్నారు. పిడుగులు పడినప్పుడు రైతులు చెట్ల కింద ఉండి మరణించకుండా వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. వరదల సమయంలో పాఠ్య పుస్తకాలు కోల్పోయిన పిల్లలకు తప్పనిసరిగా మళ్ళీ నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు అందించాలని అన్నారు. వరద బాధితులకు విద్యా సర్టిఫికెట్లతో పాటు రేషన్ కార్డ్, గ్యాస్ కార్డు వంటి ముఖ్యమైన డాక్యుమెంట్లు కూడా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విపత్తుల నష్టాల తగ్గింపునకు మనమంతా కృషి చేయాలని అన్నారు. నాలాలు, నదీ ప్రవాహాల మార్గంలో ఏవైనా అక్రమ నిర్మాణాలు ఉన్నాయా, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయ అని చెక్ చేసుకోవాలని అన్నారు. విపత్తుల వల్ల ఆర్థికంగా ఎంత నష్టం అవుతుందో అంచనా వేసేందుకు వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. విపత్తుల గురించి ప్రజలకు ముందుగానే సమాచారం అందేలా చూడాలని అన్నారు. జూన్ 16న కేంద్ర హెూం శాఖ మంత్రివర్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా స్థాయిలో విపత్తుల నిర్వహణ ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారని అన్నారు. జిల్లాలో అన్ని రకాల ప్రమాదాలకు ఒకే వేదిక నుంచి సమాచారం అందించేలా చూడాలని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నగరంలో మురికి కాల్వల, నాలాలను పూర్తి స్థాయిలో పూడీక తీత తీశామని అన్నారు. ప్రకాష్ నగర్ చెక్ డాం ఎత్తు తగ్గింపుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ వరదల సమయంలో అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకున్నామని అన్నారు. వర్షాభావ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ రైతులను సన్నద్ధం చేస్తున్నామని అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిఆర్డిఓ సన్యాసయ్య, సిపిఓ ఏ. శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి. పుల్లయ్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి, ఇరిగేషన్ ఎస్.ఈ. ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపిడివో లు, ఆపద మిత్రలు పాల్గొన్నారు.



## లాయర్లకు యూనిఫాం క్లాత్ కిట్ల పంపిణీ



**ఖమ్మం సిటీ, మహా:** బార్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు.. ఖమ్మం పార్ల మెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి సిద్ధం చేసిన యూని ఫామ్ క్లాత్ కిట్లను కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది, ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు స్వామి రమేష్ కుమార్ తో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లాయర్లకు శుక్రవారం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు, ఉద్యోగులకు ఎంపీ ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ బాధ్యులు లక్కినేని సత్యనారాయణ,కోనా చంద్రశేఖర్ గుప్తా, ఖమ్మం బాధ్యులు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ఫోసిస్‌కు ఐదుగురు యస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక



**ఖమ్మం సిటీ, మహా:** ప్రముఖ సాఫ్ట్ వేర్ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ లిమిటెడ్ కు తమ కళాశాలకు చెందిన 5గురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. హైదరాబాద్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యాంపస్ పూల్ డ్రైవ్ లో తమ విద్యార్థినులు అద్భుత ప్రతిభను కనబరచారని, జిల్లాలోని అత్యధికంగా 5గురు ఎంపికవ్వడం తమకు గర్వకారణమని కృష్ణ తెలిపారు. గురువారం ఎంపిక పత్రాలను అందుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణ మాట్లాడుతూ అటానమస్ హోదాను సాధించిన అనంతరం తమ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందించడం ద్వారా ఈ ఫలితాలు సాధించగలిగామని వారు తెలిపారు.

## బహిరంగ సభకు కదిలిన కాంగ్రెస్ శ్రేణులు



**సత్తుపల్లి, జూలై 4: మహా:** అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఏ.ఐ.సీ.సీ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బి స్టేడియంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీగా సమాయత్నం అయ్యారు. బహిరంగ సభకు బస్సులు, కార్లలో కార్యకర్తలు కొలహాలంగా బయలుదేరారు. తమ అభిమాన నాయకుడు దయానంద్ విజయకుమార్ తమతోపాటు బస్సులో ప్రయాణం చేయడంతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం వెల్లివిరిసింది.

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్



**ఖమ్మం,మహా:** జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా ఈ.వి.ఎం. గోడౌన్ ను తనిఖీ చేసి, గోడౌన్ రూం సీల్ ను పరిశీలించి, తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా చేస్తున్న డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏవో కే. శ్రీనివాసరావు, ఎన్నికల డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.




# బస్టాండ్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

**దమ్మపేట ,జూలై4 మహా :** మండలకేంద్రమైన దమ్మపేట లో బస్టాండ్ ఉన్నప్పటికీ అది నిరుపయోగంగా మారిందని ,దానిలో నిర్మాణ పనులు చేస్తున్న పెట్రోలు బంక్ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ దమ్మపేట బస్టాండ్ సాధన కార్యాచరణ కమిటీ ఆద్వర్యంలో శుక్రవారం నల్లమాస్క్ లు ధరించి నిరసన చేపట్టారు. పట్టణ వీదులలో ర్యాలీ జరుపుతూ వ్యాపార సంస్థలకు శనివారం బంద్ చేయాలని ,స్వచ్ఛందంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహశీల్దార్ భగవాన్ రెడ్డికి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఇందుకు సానుకూలంగా వర్తక వ్యాపారులు స్పందించారు. పూర్తిగా రోజంతా బంద్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ దమ్మపేట గ్రామం కోసం గ్రామస్థులందరూ కలిసికట్టుగా సమిష్టిగా కృషిచేయాలని కోరారు. ప్రయాణీకులకోసం ఉపయోగ పడాల్సి న బస్టాండ్ లో వాణిజ్య పరమైన బంక్ లను ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. తక్షణమే పెట్రోలుబంక్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



## కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం: కార్మిక సంఘాల నాయకులు



**సత్తుపల్లి, జూలై 4: మహా:** కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టాక కార్మిక రంగంపై ఎన్నడూ లేని విధంగా వివక్షత చూపుతుందని, కార్మికులు సాధించు కున్న చట్టాల ను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా విభజించాలని రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రూపొందించడానికి తీవ్రమైన ప్రయత్నం జరుపుతుందని దీని వ్యతిరేకంగా పోరాడాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు కార్మిక వర్గానికి రైతాంగానికి పిలుపునిచ్చారు. సత్తుపల్లిలో హమాలి భవన నిర్మాణ కార్మికుల అడ్డాల దగ్గర జూన్ 9న జరుగు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని గ్రూప్ మీటింగులు కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో సంఘటత,అసంఘటిత రంగాలలో సుమారు 42 కోట్ల మంది కార్మిక వర్గం ఉందని అందులో కేవలం ఏడు కోట్ల మంది కార్మికుల సామాజిక భద్రత కనీస వేతనాలు ఇతర చట్టాల అమలు అవుతున్నాయని మిగతా 35 కోట్ల మంది కార్మిక వర్గం చాలీచాలని జీతాలతో జీవితాలు వెలదీస్తున్నారని అన్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ఆదానికి,అంబానీలకు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం పూనుకున్నదని దేశ పరిశ్రమలు దెబ్బతీసి విదేశీ పెట్టుబడులు విచ్చలవిడిగా దేశంలోకి ఆహ్వానిస్తున్నారని దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# పాలేరు టెన్నల్ పనుల్లో అవకతవకలు

## టెండర్ ప్రక్రియ లేకుండా పనులు ప్రారంభించడం ఏంటి

- 15 కోట్ల ఖర్చుపై వివరాలు వెల్లడించాలి
- యూ టీ పనులు ఆలస్యమైతే మళ్ళీ రైతులకు నష్టం
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు
- అండర్ టర్నల్ నిర్మాణ పనులు పరిశీలించిన బిజెపి నేతలు





**పాలేరు,.మహా:** పాలేరు సాగర్ ఎడమ కాలువ అండర్ టెన్నల్ నిర్మాణ పనులపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, టెండర్ ప్రక్రియకు విరుద్ధంగా కాంట్రాక్టులు అప్పగించారని ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. శుక్రవారం బీజేపీ జిల్లా నాయకుల బృందం పాలేరు వద్ద జరుగుతున్న అండర్ టెన్నల్ పనులను పరిశీలించింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది అకస్మాత్తుగా సంభవించిన భారీ వర్షాలకు నాగార్జునసాగర్ ఎడమ కాలువకు అనుసంధానంగా ఉండే అండర్ టెన్నల్ కొట్టుకుపోయిన విషాద ఘటనను వారు గుర్తు చేశారు. కాలువ తెగిపోవడం వల్ల ఆయకట్టు రైతులు పంటలు నష్టపోయారని, సాగు నిష్ప్రయోజనమై రైతులు అప్పుల్లో మునిగిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అనుభవం మరువకముందే ప్రభుత్వం తగిన గమనిక తీసుకోకుండా మరోసారి అదే తప్పిదాన్ని పునరావృతం చేస్తుందన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.15 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెబుతూనే, దానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించకుండా మౌనాన్ని పాటిస్తోందని బీజేపీ విమర్శించింది. కాంట్రాక్టు పద్ధతిలో పనులను అప్పగించడంలో అనేక అనుమానాస్పద అంశాలున్నాయని నేతలు తెలిపారు. పారదర్శకత లేకుండా టెండర్లను పక్కనపెట్టి ఇష్టానుసారంగా పనులను అప్పగించడం న్యాయపరంగా కూడా తప్పుపట్టదగిన చర్య అని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని, వర్షాకాలం ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో ఈ పరిస్థితి రైతులకు మరోసారి చేదు అనుభవాన్ని మిగిల్చే అవకాశముందని హెచ్చరించారు. తక్షణమే పనులను వేగవంతం చేయకపోతే సాగర్ జలాలు ఆయకట్టుకు చేరక మళ్లీ పంటలు నష్టపోవడం అనివార్యమవుతుందన్న భావన రైతుల మధ్య వ్యాపిస్తోంది. పనుల్లో నాణ్యత లేకపోవడం స్పష్టంగా కనిపిస్తున్నందున వాటిపై సాంకేతిక పరిశీలన జరిపించాలని, నిధుల వినియోగంపై సమగ్ర ఆడిట్ చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది. నిర్మాణ ప్రక్రియలో జరుగుతున్న అన్ని ఖర్చుల వివరాలను ప్రభుత్వం తక్షణమే బహిరంగ పరచాలని కోరారు. లేకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన కార్యాచరణ చేపడతామంటూ బీజేపీ నేతలు స్పష్టంగా హెచ్చరించారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదు, రైతుల హక్కులను కాపాడే పోరాటమని వారు స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పందించే వరకు బీజేపీ కార్యకర్తలు కలెక్టరేట్ స్థాయిలో నిరసనలు, మండల కేంద్రాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాలేరు అండర్ టెన్నల్ పనులు పూర్తవకపోతే, ఖమ్మం జిల్లాలో పలు మండలాలకు సాగర్ జలాల చేరిక కష్టమవుతుందని బీజేపీ హెచ్చరించింది. రైతుల జీవనాధారమైన కాలువల పనులపై నిర్లక్ష్యం ప్రదర్శించడం క్షమించలేని తప్పు అని బీజేపీ నాయకులు నొక్కి చెప్పారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నున్నా రవికుమార్, మండల అధ్యక్షురాలు పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు

# మున్నేరు లోతట్టు ప్రాంతాల్లో చర్యలు చేపట్టాలి

## క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్

**ఖమ్మం, మహా:** మున్నేరు వరదలలో లోతట్టు ప్రాంతాలలో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని మున్నేరు లోతట్టు ప్రాంతాలను జిల్లా కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పర్యటించారు. కాల్వ ఒడ్డు మున్నేరు బ్రిడ్జి, బొక్కలగడ్డ, వినాయక నిమజ్జన ఘాట్ ప్రాంతం, ప్రకాష్ నగర్, జలగంనగర్ తదితర ప్రాంతాలను రాబోయే వరద ప్రభావం విపత్తు నిర్వహణపై ఎస్డీఆర్ఫ్ బృందాలు, రెవెన్యూ, ఇర్రిగేషన్, పంచాయతీ రాజ్, పోలీస్, మునిసిపల్ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు సన్నద్ధతపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, విపత్తుల పట్ల ముందస్తు ఏర్పాట్లతో అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు కష్టం కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాలు, ప్రమాదకర నీటి వనరుల పట్ల ముందస్తుగా మ్యాపింగ్ చేసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయో గుర్తించి, వాటిని సరిదిద్దాలన్నారు. ఆపద మిత్ర క్రింద యువతి, యువకులను గుర్తించి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు, జిల్లాలో



గ్రామీణ ప్రాంతాల్లో 139, పట్టణ ప్రాంతాల్లో 161 మంది యువతను నియమించినట్లు, ప్రజలకు వారి సేవలు అందించాలని సూచించారు. అధికారులు, ఆపదమిత్ర, ఫిషర్ మెన్, ఈతగాళ్లతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రమాదకర మేజర్ రోడ్లను ముందస్తుగా ఆర్టీసీ బస్సులతో బ్లాక్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పర్యాటకులను ప్రమాదకర ప్రదేశాల్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండి ముంపు ప్రాంతాల్లో ఉన్న మేజర్ టవర్ లకు ఏమైనా ఇబ్బందులు కలిగే సూచనలు ఉన్నచోట ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో 1077 నెంబర్ తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని తెలిపారు. గత సంవత్సరం వచ్చిన భారీ వరదల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో 3 నెలల పాటు ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రిహాబిలిటేషన్ సెంటర్ లను ముందుగా గుర్తించాలని, అవసరమైన పక్షంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లను కూడా రిహాబిలిటేషన్ సెంటర్ గా ఏర్పాటు చేయాలని అన్నారు. వాతావరణ శాఖ నుంచి వరద ముప్పు ఉందని హెచ్చరిక రాగానే జిల్లాలో వరద సమయంలో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు, జేసిబి , క్లినింగ్ ఎక్విప్మెంట్ మొదలగు సామాగ్రి డివిజన్, గ్రామం వారీగా అందుబాటులో పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, సహాయ మున్సిపల్ కమీషనర్ సంపత్ కుమార్, తహసీల్దారు సైదులు, రాంప్రసాద్, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఎంపీడివో కుమార్, ఎన్డిఆర్ఎఫ్ బృందం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# మెనూ ఖచ్చితంగా పాటించాల్సిందే

**నేలకొండపల్లి, జూలై 4 మహా:** ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం లో మెనూ పాటించకుంటే చర్యలు తప్పవని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు హెచ్చరించారు. మండలం లోని పలు గ్రామాలలో పాఠశాలలో మధ్యాహ్నం భోజనం



పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యత గురించి విద్యార్థుల ను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పెట్టకపోతే తమకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులను కోరారు. అనంతరం ఏజెన్సీలు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. మధ్యాహ్నం భోజనం నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వంటలను ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున్న తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు నిత్యం తనిఖీలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆయా సీఆర్పీలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# 12 వేల 500 ఎకరాల్లో వరిసాగుకు సిద్ధం

**దమ్మపేట ,జూలై 4 మహా :** మండలంలో మొత్తం 12,500 ఎకరాల్లో వరి సాగుకు రైతన్నలు సిద్ధంగా ఉన్నారని ,ఆ క్రమంలోనే నాట్లు ప్రక్రియను ప్రారంభించారని మండల వ్యవసాయ శాఖాధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శు



క్రవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ ఇప్పటికే వర్షాలు అధికంగా కురుస్తుండటంతో ఆసన్నగూడెం ,నాచారం ,మొద్దులగూడెం ,గణేశ్ పాడు తదితర ప్రాంతాల రైతులు నాట్లు కూడా పూర్తి చేశారని తెలిపారు. అందుకు అవసరమైన ఎరువులు ,యూరియా ,డిఏపి దుకాణాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కోపరేటివ్ సొసైటీ ,ప్రైవేట్ దుకాణాల లో మొత్తం యూరియా 260 మెట్రిక్ టన్నుల వరకు ,కాంప్లెక్స్ ఎరువులు 360మెట్రిక్ టన్నులు ,డిఏపి 170 మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖాధికారి తెలిపారు. రైతులు ఏ పంటలను వేసినా ఎరువుల కొరత లేదని ,ఎరువులు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తలు పాటించి ,నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని తెలిపారు.మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల రికార్డులను పరిశీలించారు.

# ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ముదిగొండ జూలై 4 మాహా:** ముదిగొండ మండల పరిధిలోని మున్నేరు ముంపు ప్రాంతాలైన పండ్రేగుపల్లి గ్రామంలో వరద పరిస్థితిని కరకట్ట నుంచి పరిశీలించారు అనంతరం వరద ప్రభావిత ప్రాంతాలలో పారిశుధ్య పనులు ఓవర్ హెడ్ ట్యాంక్స్ శు



భ్రపరచడం, క్లోరినేషన్ చేయడం, వీధులను శుభ్రపరచి బ్లీచింగ్ వేయడం, మురుగు కాలువల్లో పూడిక తీత, చెత్త కుప్పల తొలగింపు ప్రక్రియను శరవేగంగా చేయాలని వీలైనంత త్వరగా పారిశుధ్య సంబంధిత పనులు పూర్తి చేయాలని గ్రామ పంచాయితీ సెక్రటరీకి వివరించారు సీజనల్ వ్యాధుల నివారణ చర్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తున్నామని ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సునీతా తెలిపారు వారి వెంట రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వహీదా సుల్తానా,ప్రసన్న కుమార్ ఉన్నారు.

# సర్దుబాటు సవరించే వరకు ఉద్యమం ఆగదు

**నేలకొండపల్లి, జూలై 4 మహా:** ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను సవరించే వరకు ఉద్యమం ఆగదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని వివిధ గ్రామాల పాఠశాలలో



సభ్యత్వ నమోదు కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... ప్రభుత్వం నర్సరీ, కేజీ తరగతులకు ప్రాథమిక పాఠశాలలో ప్రవేశపెట్టి తరగతి కి ఒక ఉపాధ్యాయుడు ని కేటాయించి పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. పాఠశాలలో ప్రవేశాల కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన ఆవసాలు పెరిగినందున్న అక్కడ నూతన పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ యూపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. నూతన జాతీయ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కట్టా పద్మ, అరవింద్, జ్యోతి, వెంటరమణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, తొర్తి గురవయ్య, నవాబ్సాహెబ్, కోటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

# హైద్రాబాద్ తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు

**నేలకొండపల్లి, జులై 4 మహా:** హైద్రాబాద్ లో జరిగిన కాంగ్రెస్ గ్రామ శాఖల అధ్యక్షుల సభ కు మండలం నుంచి పెద్ద సంఖ్యతో తరలివెళ్లారు. శుక్రవారం ర్యాలీ ని నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు...కాంగ్రెస్ ను స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు, మంత్రి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు ప్రతీ ఒక్కరూ పని చేయాలని సూచించారు. నాయకులు జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, తీగ రమణయ్య, యడవల్లి హుస్సేన్ గౌడ్, సైదా, నంబూరి నరేష్ పాల్గొన్నారు.

# ఔదార్యం చాటుకున్న విలేకరులు

**తిరుమలాయపాలెం. మహా:** ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై స్వగృహంలో విశ్రాంతి తిసుకుంటున్న మండల పరిధిలోని బీరోలు గ్రామానికి చెందిన ఓ పత్రిక విలేఖరి దామల భాస్కర్ ని మండల విలేకరులు శుక్రవారం దామల భాస్కర్ ని పరామర్శించారు. ఈ సందర్భంగా 25 కేజీల బియ్యం, కిరాణా సరుకులు అందించి తమ ఔదార్యం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పసలాది సత్యనారాయణ, పప్పుల శ్రీను, ఉపాధ్యక్షులు పోలేపొంగు నాగరాజు, కూరపాటి విజయ్, ప్రచార కార్యదర్శి గుజ్జ రామకృష్ణ, గదరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టును పరామర్శించిన టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కారేపల్లి, మహా : కారేపల్లి మండల ప్రజాజ్యోతి విలేకరి తేళ్ల శ్రీనివాస్‌ను టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల తేళ్ల శ్రీనివాస్ తండ్రి తేళ్ల వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు గేటుకారేపల్లికి వెళ్ళి మృతుడు తేళ్ల వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. కుమారుడు తేళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, వేగినాటి మాధవరావు, షేక్ జానీపాషా, రవికిరణ్, అజ్మీర వీరన్న, భూక్య రాంకిషోర్, అదేర్ల నాగరాజు, భయ్యా నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



# బదిలీ అయిన డీసీసీబీ అధికారులకు వీడ్కోలు

**కారేపల్లి, మహా :** డీసీసీబీ కారేపల్లి లో పని చేసి బదిలీ అయిన అధికారులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డీసీసీబీ కారేపల్లి బ్రాంచీలో అసిస్టెంట్ మేనేజర్ గోపతి పద్మావతి, క్యాషియర్ ఆలేటి గాయత్రి లు ఖమ్మంలోని బ్రాంచీలను బదిలీ అయ్యారు. ఈసందర్భంగా కారేపల్లి బ్రాంచీలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మేనేజర్ బాల రవికుమార్ మాట్లాడుతూ డీసీసీబీలో రైతులకు సేవ చేయటం ఎంతో అనందాన్ని ఇస్తుందన్నారు. వృత్తిలో ఖాతాదారుల అభిమానాన్ని చూరగొనటం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా డీసీసీబీలో వివిధ రకాలు రుణాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. సక్రమంగా రుణాలు రెన్యూవల్ ద్వారా అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలోసూపర్‌వైజర్ కొంగర వేణు, ఉద్యోగులు అరుణ, సురేష్, వెంకట్రావు, పుచ్చకాయల వంశీ, ఆదెర్ల అంజమ్మ, సొసైటీ సిబ్బంది ఉండం సాంభశివరావు, ముండ్ల సురేష్, దమ్మాలపాటి నాగేశ్వరరావు, యాకూబ్‌పాష తదితరులు పాల్గొన్నారు.



# 9న సార్వత్రిక సమ్మెకు సహకరించండి

**భద్రాద్రి కొత్తగూడెం టౌన్ జూలై 4 (మహా):** ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ సహజ వనరుల రక్షణ, కార్మిక చట్టాల పరిరక్షణకోసం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలనీ కోరుతూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్ల, అసోసియేషన్ల పిలుపుమేరకు శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన సెంటర్ల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని పాలకేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎంజి రోడ్డు, పెద్దబజార్, బస్టాండ్, పోస్టాఫీసు మీదుగా బైపాస్ రోడ్డువరకు చేరింది.





# కల్తీ కలకలం!

## ఖమ్మం రెస్టారెంట్లపై షాకింగ్ దాడులు

## వైరా రోడ్ పసందు కాదు .. కల్తీ మసాలా రగడ

### పచ్చళ్లు, స్వీట్స్ ఆహార భద్రతకు విఘాతం ... ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో కల్లోలం

**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరం తినుబండారాల వెనక దాగిన కల్తీ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం జరిగిన తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ దాడులు స్థానిక రెస్టారెంట్లు, స్వీట్ హౌస్‌లు, మసాలా కేంద్రాలు, ఐస్ క్రీమ్ యూనిట్లను చుట్టేసాయి. ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారే పరిస్థితులు అక్కడ రాజ్యమేలుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ చట్టం 2006 ఉల్లంఘనలతో పాటు అపరిశుభ్రత, కాలం చెల్లిన పదార్థాలు, లేబుల్ లోపాలు వంటి పలు చట్టవ్యతిరేక చర్యలు చోటుచేసుకున్నట్టు అధికారుల నివేదిక స్పష్టం చేసింది. ఖమ్మం ఫుడ్ రంగంలో మాఫియా స్థాయికి చేరిన కల్తీ ముఠాలను బయటపడేసిన ఈ దాడులు ప్రజల్లో భయాందోళన కలిగించగా ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ చర్యలు అవసరమని అధికారులు స్పష్టం చేశారు. ఖమ్మం నగరాన్ని తినే తిండి భద్రతపట్ల అధికారుల కన్ను కట్టింది. ఖమ్మం పట్టణంలోని వైరా రోడ్, ఎన్టీఆర్ సర్కిల్ పరిసరాల్లోని ప్రముఖ ఆహార తయారీ, విక్రయ కేంద్రాల్లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సంచలనం సృష్టించింది. ఈ దాడుల ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యాన్ని తృణప్రాయంగా తీసుకుంటూ వ్యాపారం చేస్తున్న నిర్వాహకులను నిలదీసిన టాస్క్ ఫోర్స్ హెడ్ వి. జ్యోతిర్మయి, ఎఫ్.ఎస్.ఎస్. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

#### పాలమూరు గ్రిల్స్ రెస్టారెంట్ దాడి


పట్టణంలోని పాలమూరు గ్రిల్స్ రెస్టారెంట్‌లో వంట గది పూర్తిగా అపరిశుభ్రంగా ఉండటం అధికారులను షాక్‌కు గురిచేసింది. ఫ్రిడ్జులు, కోల్డ్ స్టోరేజ్‌లు సరైన ఉష్ణోగ్రతను పాటించకపోవడం గుర్తించారు. రూ.2,000 విలువ గల 8 లీటర్ల ఎక్స్ పైర్ అయిన ఫ్రూట్ క్రషెస్, రూ.19,000 విలువ గల 40 కిలోల కాజు, షాజీరా, నూడిల్స్ వంటి ముడి పదార్థాలపై లేబుల్ లోపాలు ఉండటం అధికారుల ఆగ్రహానికి గురి అయ్యాయి. కాలం చెల్లిన పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఫుడ్ సేఫ్టీ చట్టాన్ని ఉల్లంఘించినందుకు నోటీసులు జారీ చేశారు.

#### పిఎస్‌కే ఫుడ్స్ అండ్ స్పైసెస్ దాడి

వైరా రోడ్‌లో గల ఈ మసాలా దినుసుల తయారీ కేంద్రంలో ఉన్నత ప్రమాణాలకు విరుద్ధంగా పదార్థాలను నిల్వ ఉంచుతున్నట్టు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ఫుడ్ హ్యాండ్లర్స్ పరిశుభ్రత పాటించకపోవడం, తగిన లైటింగ్, వెంటిలేషన్ లేకపోవడం స్పష్టమైంది. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో పచ్చళ్ళ నిల్వ, ముడి పదార్థాలపై ఈగలు పట్టే పరిస్థితుల్లో ఉండటం, రెడీ టు ఈట్ సేవరిస్, మినపప్పు, రాక్ సాల్ట్, బెల్లం, నూనె, నెయ్యి వంటి పదార్థాలపై లేబులింగ్ లోపాలు ఉన్నట్టు తేలింది. కొన్ని పదార్థాలను సీజ్ చేయడంతో పాటు, అనుమానాస్పద శాంపిళ్లను హైదరాబాద్‌కు పంపించారు.

#### ఐబాకో ఐస్ క్రీమ్ యూనిట్ దాడి

లైసెన్స్ లేకుండానే పని చేస్తున్న ఈ యూనిట్‌లో అపరిశుభ్ర వాతావరణంలో ఐస్ క్రీములు, చాక్లెట్లు నిల్వ ఉంచుతున్నారు. తయారీ, ఎక్స్ పైరీ డేట్లు సరిగా డిస్ప్లే చేయకపోవడం, చాక్లెట్లు ఇతర పదార్థాలను రిఫ్రిజిరేటర్లలో స్వచ్ఛత లేకుండా నిల్వ చేయడం, పెస్ట్ కంట్రోల్ చేయకపోవడం వల్ల నోటీసులు జారీ చేశారు.



#### టాస్క్ ఫోర్స్ హెచ్చరికలు

ఫుడ్ టాస్క్ ఫోర్స్ హెడ్ వి. జ్యోతిర్మయి మీడియాతో మాట్లాడుతూ "ప్రజారోగ్యం పట్ల చెలగాటం ఆడే వ్యాపారులను ఉపేక్షించము. నిబంధనలు పాటించని వారిపై చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అవసరమైతే వ్యాపార స్థలాలు సీజ్ చేస్తాం" అని హెచ్చరించారు. ఆహారాన్ని తయారు చేసే ప్రతి సంస్థ, నిల్వ చేసే గోదాములు, విక్రయించే దుకాణాలు అన్నీ నిబంధనల మేరకు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారులు స్వచ్ఛత, పరిశుభ్రత విషయంలో బాధ్యతతో వ్యవహరించాలని, కల్తీ పదార్థాల సరఫరా ఆపివేయాలని హెచ్చరించారు.

#### జిపి రెడ్డి ఘీ స్వీట్స్ షాప్ దాడి

ఎన్టీఆర్ సర్కిల్‌లో గల ఈ స్వీట్ యూనిట్‌లో కేక్స్ తయారీ పూర్తిగా అపరిశుభ్రంగా ఉండటం, హానికర రసాయనాలతో కలిపిన రంగులను వినియోగించడం, ప్లాస్టిక్ బకెట్లలో క్రీములు నిల్వ చేయడం అధికారుల నిర్లక్ష్యానికి ఉదాహరణగా నిలిచింది. ఈగలు పట్టిన కేక్స్ నిల్వ ఉంచినదాన్ని చూసిన వెంటనే 5 కిలోల ఎక్స్ పైర్ చెర్రీస్, ఫ్రూట్ క్రషెస్ (రూ.20,000 విలువ) ధ్వంసం చేశారు. లేబులింగ్ లోపాలు ఉన్న రూ.30,000 విలువ గల 15 కిలోల కాన్ఫెక్షనరీ, డ్రై ఫ్రూట్స్, మిస్సలేనియస్ పదార్థాలను సీజ్ చేశారు.

06
FOLLOW: @ANNTELUGU
5-7-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# పాము కాటుకు నాటు కోడి వైద్యం!

## కలకోట గ్రామంలో విస్తరించిన అరుదైన నాటు వైద్యం

- పదహారు కోళ్ల ప్రాణాలకే ఒక మనిషి ప్రాణం!
- పాము కాటుకు కోడి నడుమ కొత్త ఆశా కిరణం?
- శాస్త్రం తేల్చాల్సిన నాటు కోడి ప్రయోగం

**బోనకల్ , మహా:** వైద్య శాస్త్రం ఏదైనా మనిషి ప్రాణాలను కాపాడటమే లక్ష్యం. గ్రామీణ జీవితంలో అది పాఠశాల డిగ్రీతో ఉండకపోయినా, అనుభవంతో కూడిన నమ్మకంతో పని చేస్తుంది. ఇదే సాక్ష్యంగా నిలుస్తున్నది ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం కలకోట గ్రామం. ఇక్కడ ఒక సామాన్య వ్యవసాయ కూలి “పాము కాటు”కి నాటు కోడి మలద్వారం ద్వారా విషం ఆకర్షించటం అనే పద్ధతిలో చికిత్స చేస్తూ, ఇప్పటివరకు పలువురు బాధితులకు ప్రాణదాతగా మారాడని గ్రామస్తుల గౌరవభావన. దీనిపై శాస్త్రీయ సమీక్ష అవసరం ఉన్నప్పటికీ, ఈ నమ్మకబద్ధమైన ప్రత్యామ్నాయ చికిత్స గ్రామాల్లో బలంగా నిలిచిన వాస్తవం. కలకోట గ్రామంలో నివసించే ఒక సామాన్య రైతు తోటపల్లి సురేష్, ‘పాము కాటు’ వంటి అత్యవసర స్థితుల్లో ౦ ఆసుపత్రుల ఆవశ్యకత లేకుండా, ఓ వింతైన కానీ స్థానికంగా నమ్మకమైన నాటు వైద్యాన్ని అందిస్తున్నాడు. అతను గత 15 సంవత్సరాలుగా గ్రామ స్థాయిలో “నాటు కోడి మలద్వారం” ఆధారంగా పాము కాటు చికిత్స అందిస్తున్నాడు. ఈ పద్ధతిలో ప్రత్యేకత ఏమిటంటే, పాము కాటుకు గురైన వ్యక్తి దేహంపై పాము కరిచిన చోట ౦ నాటు కోడి మలద్వారాన్ని ఉంచడం ద్వారా విషాన్ని శోషింపజేస్తారని నమ్మకం ఉంది. కోడి దీనివల్ల చనిపోతుంది. విషం పూర్తిగా తొలగిపోవాలంటే కొన్నిసార్లు పదహారు కోళ్లకుపైగా చనిపోతాయని ఆయనే చెబుతున్నారు. తన గురు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి దగ్గర నేర్చుకున్న ఈ పద్ధతిని, ఆయన మృతికి తర్వాత



కొనసాగిస్తూ, తక్కువ ఖర్చుతో ౦ ఫీజు తీసుకోకుండా ౦ సేవలందిస్తున్నాడు సురేష్. “ఎంత ఇస్తారో వాళ్ల ఇష్టం” అన్న సూత్రంతో పనిచేస్తున్న ఇతని సేవలు చుట్టుపక్కల గ్రామాలవారికి నమ్మకంగా మారాయి. ఇప్పటివరకు చేసిన చికిత్సల్లో ఒక్కరు కూడా ప్రాణాలు కోల్పోలేదన్నది గ్రామస్థుల వాదన. ఇది నిజం అయితే ౦ సురేష్ ఒక వైద్యాశాస్త్ర పరిధిలోకి రాని నైపుణ్యాన్ని చాటుతున్నాడన్న అర్థం. కానీ ఇది శాస్త్రీయంగా నిరూపితమయ్యేంతవరకు ౦ ప్రజారోగ్య దృష్ట్యా అధికారుల జోక్యం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం, “త్రాచుపాము” వంటి తీవ్ర విషపూరితమైన పాముకాటు జరిగిన సందర్భాల్లో ఒక సారి 24కి పైగా కోళ్లు చనిపోయిన సందర్భం కూడా ఉందట. ఇది తానే స్వయంగా చూసినదని అతను చెబుతున్నాడు. ఇతని తీరును చూసిన గ్రామస్తులు సంతోషంతో పాటు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ఈ పద్ధతిని వీడియోల రూపంలో చిత్రీకరించి సోషల్ మీడియా ద్వారా షేర్ చేయటంతో ఈ విషయం మరింత వైరల్ అయ్యింది. అయితే ౦ ఇది ఓ స్థానిక నమ్మకమైన చికిత్సా పద్ధతి మాత్రమే. దీనిపై ప్రభుత్వ వైద్యశాఖ, పబ్లిక్ హెల్త్ అధికారులు క్లినికల్ అధ్యయనం చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఈ పద్ధతిని ప్రయోగాత్మకంగా కాకుండా ౦ అత్యవసర స్థితుల్లో మాత్రమే, సరైన వైద్య సలహాతో పాటే వినియోగించాలి. ఈ ఉదంతం మనకు గుర్తుచేసేది ౦ భారతదేశంలోని గ్రామీణ ప్రజల దగ్గర ఉన్న అనుభవ జ్ఞానాన్ని గౌరవించాలి, కానీ అదే సమయంలో శాస్త్రీయ పరిశీలనకూ లోబడి ఉండేలా చూడాలి. కలకోట గ్రామంలోని తోటపల్లి సురేష్ చూపుతున్న సేవా దృక్పథం ప్రేరణగా నిలుస్తున్నా, ఇది తప్పకుండా ప్రభుత్వం పరిశీలించి శాస్త్రీయంగా ధృవీకరించాల్సిన అంశం.

## టిఎల్‌యుడి పద్ధతిలో నాణ్యమైన బయోచార్ తయారీ

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 4 (మహా):** జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేకంగా ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బయోచార్ యూనిట్ ద్వారా సుజాతనగర్ మండలంలోని మేకలగడ్డ గ్రామంలో బయోచార్ తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రయత్నంలో 30 కిలోల వేస్ట్ కట్టెముక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసి మండించడం ద్వారా 10 కిలోల నాణ్యమైన బయోచార్ తయారు చేయగలిగారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఇలా



తయారైన బయోచార్ ను ఆవుపంచకం (ఆవు పేడ మొదలైనవి)తో కలిపి కొన్ని రోజులు నిల్వ ఉంచి ఆరబెట్టి, పొడిగా చేసి పంటలకు ఎరువుగా ఉపయోగించాలని సూచించారు. డివిజన్లోని రైతువేదికల ద్వారా బయోచార్ తయారీ విధానం గురించి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ పిడి, సుజాతనగర్ ఎంపిడిఓ సుజాతనగర్ తహసీల్దార్ ఈసి రాజు, ఎడిఎ (టెక్నికల్), వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ విజయభేరికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**కారేపల్లి, మహా :** హైదరాబాదులో శుక్రవారం జరిగిన సామాజిక న్యాయ విజయభేరికి కారేపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్ళారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సారధ్యలో కాంగ్రెస్ జాతీయ



అధ్యక్షులు మల్లిఖార్జున ఖార్గే ముఖ్యఅతిధిగా హాజరైన సభకు బస్, కారులలో నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్ళిన వారిలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## సాయుధ పోరాట తొలి అమరుడు కొమరయ్య

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 4 (మహా):** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. శుక్రవారం బిసి సంక్షేమ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో




దొడ్డి కొమురయ్య వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కొమురయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, విముక్తి పోరాటాన్ని చేసిన.ల్ మహనీయుడు కొమురయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం మాట వినపడగానే మొట్ట మొదట గుర్తుకొచ్చేది దొడ్డి కొమురయ్య పేరేనని ఆయన తెలిపారు.దొరల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీరుడు దొడ్డి కొమురయ్య అని చెప్పారు. వరంగల్ జిల్లాలోని సాధారణ గొర్రె కాపరుల కుటుంబంలో జన్మించిన కొమురయ్య తెలంగాణ మహోన్నత ఉద్యమానికి ఆధ్యుడయ్యాడని అన్నారు .తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుగా ప్రాణాలను త్యాగం చేసి ఉద్యమానికి ఊపిరి పోసాడని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, బీసీ సంక్షేమ అధికారిని ఇందిర, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, క్రీడల అధికారి పరంధామ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనంత రామకృష్ణ, కురుమ సంఘ సభ్యులు దూడల బుచ్చయ్య, లింగయ్య, రవికుమార్, చంద్రశేఖర్, దూడల కిరణ్, సుంక ప్రవీణ్, కోటిలింగం, సంపత్ కుమార్, కే రవి మరియు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తగూడెం మండల స్థాయి విత్తనాల సేకరణలో రామవరం హై స్కూల్ మరియు కూలీ లైన్ హై స్కూల్

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 4 (మహా):** విద్యార్థుల్లో పర్యావరణం-పచ్చదనం, చెట్ల ప్రాముఖ్యత పట్ల అవగాహన పెంచే క్రమంలో భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వినూత్నంగా విత్తనాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు కొత్తగూడెం మండలంలో రామవరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరం, కూలీలైన్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కూలీలైన్ ప్రథమ స్థానంలో నిలిచాయి. ఆపై మండల స్థాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరం ప్రథమ స్థానంలో, కూలీలైన పాఠశాల ద్వితీయ స్థానంలో ఉన్నాయి. కాంప్లెక్స్ స్థాయి విజేతలకు 1 వెయ్యి రూపాయల, మండల స్థాయి విజేతలకు 5 వేల రూపాయలు ప్రోత్సాహకంగా కలెక్టర్ ప్రకటించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించే వారికి 50 వేలు ప్రోత్సహంగా కలెక్టర్ ఇవ్వనున్నారు. చెట్ల పెంపకం-వాటి ప్రాముఖ్యత గూర్చి ఈ వినూత్న కార్యక్రమాన్ని విద్యార్థుల్లో అవగాహన కలిగించేలా జిల్లా కలెక్టర్ వినూత్న%శీ%గా శ్రీకారం చుట్టారు. 80 రకాలు సుమారుగా 70 కిలోల విత్తనాలను విద్యార్థులు సేకరించారు. కొత్తగూడెం మండల స్థాయి ఎంపికలో నిర్ణేతలుగా ఆనందఖని ఉన్నత పాఠశాల సీనియర్ సిబ్బంది, కూలీ లైన్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లాలు, కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్, సిఆర్పిలు మరియు ఎమ్ఆర్పిలు పాల్గొన్నారు.



# జూలై 9న సమ్మె కు సన్నద్ధం కావాలి

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 4 (మహా):** కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమైన నాలుగు లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని, ఇరవై తొమ్మిది కార్మిక చట్టాల అమలుకు సమరశీల పోరాటాలు తప్పవని,దానిలో




భాగంగానే జులై 9 న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె కి కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ఈ పిలుపుని జిల్లా లో అత్యంత జయప్రదంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కేజే రమేష్ అన్నారు. సిఐటియు కొత్తగూడెం టౌన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన అన్నారు . బ్రిటిష్ కాలంలోనే కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కరానికి,కార్మిక భద్రథ కి,సంక్షేమానికి అనేక పోరాటాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకున్నారని అన్నారు.కార్మిక చట్టాలని కరోనా కాలంలో మోడీ ప్రభుత్వం మెజువాణి ఓటుతో పార్లమెంట్ లో మార్పులు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చారని అన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలను సంతృప్తి పరచడానికి,వారి ఆదాయాలను మరింత రెట్టింపు ఛేయడానికి,కార్మిక వర్గం ముల్లులు పీల్చి పిప్పి చేయడానికి నాలుగు లేబర్ కోడ్ లను మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు.ఇప్పటికే దేశం లోని బిజెపి పాలిత రాష్ట్రాలలో నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేస్తున్నారని,బిజెపి మిత్రుడుగా ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏడాది పాలను పూర్తైనా సందర్భం లో కార్మికులకు ఎనిమిది గంటల పని స్థానంలో పది గంటల పని దినాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ అంబాలదుర్గమ్మ సిఐటి నాయకులు వై వెంకటేశ్వరరావు ప్రమోద్ కళావతి అల్లి నాగయ్య సతీష్ కట్ట శ్రీను గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిలో ముగిసిన రెండు కలలు

- ఒక్క క్షణం... ఇద్దరి జీవితానికి ముగింపు
- విషాదాన్ని మోసుకొచ్చిన మున్నేరు ప్రవాహం
- శుభ్రం చేసిన బైకు... మలినమైన భవితవ్యాలు.
- కన్నీటి వాల్మీకి అయిన ఊరి నది

**చింతకాని , మహా:** ఒక చిన్న అనుకోని పనికి బయలుదేరిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు నదిలో మునిగి మృతిచెందిన విషాద ఘటన శుక్రవారం చింతకాని మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. నిత్య జీవితంలో సాదాసీదాగా కని పించే నదితీరాలు ఒక్కసా రిగా కన్నీటి మయమయ్యాయి. ఒక్క క్షణంలో మూడు కుటుంబాల్లో వెలుగులు చీకట్లోకి మసకబారి



పోయాయి. గ్రామంలో ప్రతి ఒక్కరి హృదయాన్ని కుదిపేసిన ఈ సంఘటన స్థానికంగా మానవీయ వేదనల్ని చర్చకు తెచ్చింది. చింతకాని మండల పరిధిలోని చిన్న మండవ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వారిలో ఇద్దరు ఒక్కే కుటుంబానికి చెందిన కాశిమల నాగగోపి, నంద కిషోర్ %-% శుక్రవారం ఉదయం మోటార్ సైకిల్ శుభ్రం చేసేందుకు మున్నేరు నది వద్దకు వెళ్లారు. సాధారణ దృశ్యంగా కనిపించిన ఆ నది ఒడ్డున, వారి జీవితాల చివరి క్షణాలు మృత్యుబంధంగా మారుతాయని ఎవరు ఊహించగలరు? మోటార్ సైకిల్ శుభ్రం చేసిన అనంతరం వారు ఒడ్డుకు రావాలనే క్షణంలో ప్రమాదవశాత్తూ ముగ్గురూ నీట మునిగారు. అకాల ఆపదలో మునిగిన వారిలో ఒకరిని అదే సమయంలో అక్కడ చేపలు పడుతున్న వ్యక్తి సాహసంగా కాపాడగా, మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి తన అధికార బృందంతో వెంటనే స్పందించి సహాయక చర్యలు ప్రారంభించారు. అత్యవసరంగా జెసిబి సహాయంతో నీటిని తిప్పి, మృతదేహాలను వెలికితీశారు. ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందినవారే కావడం గ్రామస్తులను మరింత కలిచివేసింది. చిన్న చిన్న ఆశలతో జీవితం గడుపుతున్న ఒక నిరుపేద కుటుంబంలో ఈ దారుణం జీవితాన్ని తుడిచిపెట్టేసినట్లే అయింది. రెండు అంత్యక్రియల వేదన ఒకే కుటుంబంలో చూడటం ఎంత హృదయ విదారకమో... ఆ దుఃఖాన్ని మాటల్లో చెప్పడం అసాధ్యం. గ్రామం అంతా నిశ్శబ్దంగా ఉంది. వారి తల్లిదండ్రుల రోదనలు, బంధువుల ఆర్తనాదాలు, చుట్టుపక్కల వారి తడిచిన కనులు... ఆ దృశ్యాలన్నీ గ్రామమంతా ఓ విషాదగాధలా మారాయి. “చిన్న తప్పిదం జీవితాంతం బాధను మిగులుస్తుంది” అనే సత్యాన్ని ఈ సంఘటన మరోసారి ఘాటుగా గుర్తు చేసింది.

# పర్యావరణానికి, ప్రజలకు మేలు కలిగేలా సింగరేణి మైనింగ్

- భూగర్భ జలాల పెంపుదలకు ‘నీటి బిందువు-జలసింధువు’
- ఓసీ గనుల సమీప భూములకు సాగునీరు సరఫరా
- మూతపడిన గనుల భవంతులలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు
- భూగర్భజలాలను పెంచుతున్న భారీ ఓసీ గనుల నీటి సంపులు
- ప్రతీ సమీప గ్రామంలో మెడికల్ క్యాంపులు, ఉపాధి హామీ పథకాలు
- పకడ్బందీగా గనుల మూసివేత పథకాల అమలు
- అంతర్జాతీయ మైనింగ్ సదస్సులో సింగరేణి చర్యలను వివరించిన సీఎండీ ఎన్. బలరామ్



**భద్రాద్రి కొత్తగూడెం, జులై 04 (మహా):** సింగరేణి సంస్థ తన బొగ్గు తవ్వకాలను పర్యావరణానికి నష్టం కలగకుండా, సమీప ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే విధంగా నిర్వహిస్తోందని, సంస్థ అభివృద్ధితో పాటు స్థానిక ప్రజల, సమీప ప్రాంతాల అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తోందని సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరాం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ వారి ఆధ్వర్యంలో ఉత్తమ మైన్ క్లోజర్ పద్ధతుల ద్వారా పర్యావరణహిత, బాధ్యతాయుత మైనింగ్ అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన సింగరేణి తరఫున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ అవలంబిస్తున్న విధానాలను వివరించారు. సింగరేణి సంస్థ పర్యావరణకు హాని కల్పించని సర్ఫేస్ మైనర్, ఇన్ పిట్ క్రషర్, డ్రాగ్ లైన్, కంటిన్యూయస్ మైనర్, లాంగ్ వాల్ వంటి మైనింగ్ టెక్నాలజీలని వినియోగిస్తుందని, నిబంధనల ప్రకారం మొక్కలు నాటుతూ వనాలుగా పెంచుతోందన్నారు ఇప్పటికే 7 కోట్ల 76 లక్షల మొక్కలను నాటడం జరిగిందన్నారు. బొగ్గు గనుల ప్రారంభం నుండి మూసివేత వరకు, ఆ తదుపరి కూడా మైన్ క్లోజర్ ప్లాన్ లను నిబంధనల ప్రకారం తు.చ తప్పకుండా అమలు జరుపుతున్నామని, యథాస్థితి పర్యావరణ పరిస్థితులకు, సమీప గ్రామాల అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక చొరవ చూపిస్తుందన్నారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ నుంచి వచ్చే సుమారు 1,205 లక్షల కిలో లీటర్ల నీటిలో కంపెనీ అవసరాలు పోగా మిగిలిన 820 లక్షల కిలో లీటర్ల నీటిని స్థానిక ప్రజల అవసరాల కోసం వినియోగించడం జరుగుతుందని, వీటిలో 465 లక్షల కిలో లీటర్ల నీటిని సమీపంలోని చెరువులు, కుంటలలోకి పంపించడం జరుగుతుందని మిగిలిన 330 లక్షల కిలో లీటర్ల నీటితో స్థానికులు తమ పంట పొలాలను సాగు చేస్తున్నారని తెలిపారు. మొత్తం మీద సింగరేణి సంస్థ అందించే నీటితో 13,625 ఎకరాలలో సేద్యం జరుగుతుందన్నారు. అలాగే భూగర్భ జలాల పెంపుదల కోసం నీటి బిందువు-జల సింధువు అనే కార్యక్రమాన్ని చేపట్టి 62 కొత్త చెరువులను నిర్మించడం జరిగిందని, 45 పాత చెరువుల్లో పూడిక తొలగింపు చేపట్టామన్నారు. పాత గనులకు సంబంధించిన భవనాలలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కోసం స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌లను ప్రారంభించడం జరిగిం దన్నారు. ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ డంప్ ల మీద కూడా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గనులకు సమీపంలోని గ్రామాలలో వ్యవసాయ అభివృద్ధి కోసం 20 వ్యవసాయ చెరువుల్లో పూడిక తొలగించడం జరిగిందని, సింగరేణి చేపట్టే భారీ ప్లాంటేషన్ పనులు మరియు ఇతర ఔట్ సోర్సింగ్ పనుల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఛైర్మన్ తో పాటు సింగరేణి తరఫున డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ( ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ ) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పువ్వాడను పరామర్శించిన కేటీఆర్, హరీష్‌రావు

**మహా :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో పరామర్శిం చారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల ను అడిగి తెలుసుకున్నారు. అజయ్ కుమార్ వైరల్ ఫీవర్‌తో కొద్దిరోజులుగా బాధపడుతూ ఆస్పత్రిలో చేరినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన వద్దకు వెళ్లి కేటీఆర్, హరీష్ రావు పరామ ర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పువ్వాడ ఖమ్మంలో మంత్రిగా చక్రం తిప్పారు. పార్టీలో కీలక నేతగా ఎదిగి మంత్రి పదవిని దక్కించుకున్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తరవాత



ఆయన ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో పర్యటిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# మహాసభ తీర్మానాలపై మిలిటెంట్ ఉద్యమాలు చేపడతాం

**భద్రాకొత్తగూడెం, జూలై 4 ( మహా ):** ఇటీవల జరిగిన భద్రాద్రి జిల్లా అఖిలభారత విద్యార్థి సమాఖ్య ( ఏఐఎస్ఎఫ్) నాలుగో మహాసభలో ఎన్నికైన నూతన ఆఫీస్ బేరర్లు, కౌన్సిల్ సభ్యులను శుక్రవారం శేషగిరిభవన్లో జరిగిన విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ కె ఫహీమ్ ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎస్ కే షాహిద్, కార్యదర్శిగా వర్క అజిత్, సంయుక్త కార్యదర్శిగా ఎం వినయ్, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర బాబు, టి వినయ్, పవన్ కళ్యాణ్, సంజయ్, సహాయ కార్యదర్శులుగా గుండాల సృజన్, పవన్ సాయి, గుగులోత్ వంశి, బత్తుల సాయి, ఎన్ సాయికుమార్లతో పాటు మరో 36 మంది కౌన్సిల్, 18మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఫహీమ్ ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు షాహెద్, అజిత్ మాట్లాడుతూ బకాయి ఉపకారవేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ విద్యకు దూరంచేస్తోందని, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను గెంటివేసే పరిస్థితులకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. ప్రధానమైన



ఉపకారవేతనాల సమస్యతో పాటు ఇతర తొమ్మిది అంశాలపై మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించిందని, ఈ తీర్మానాల అమలు, సాధనకోసం జిల్లావ్యాపితంగా మిలిటెంట్ ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రధానంగా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు, సంక్షేమ హాస్టళ్లు, వసతిగృహాల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ విద్య సంస్థల బలోపేతం, ఖాళీల భర్తీ, సొంత నూతన భవనాలు, ప్రైవేటు విశ్వవిద్యాలను అనుమతుల రద్దు, కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ చేపట్టబోయే ఉద్యామాలు విద్యార్థులు సహకరించాలని కోరారు

## పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు, 50 వేలు జరిమానా

**ఖమ్మం క్రైమ్, మహా:** బాలికపై లైంగిక దాడి కేసు (పోక్సో)లో మామిడి పాపారావు 30 సం,, 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ ఎఫ్ టి సి 2. ఖమ్మం, గౌరవ న్యాయమూర్తి కె. ఉమాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలానికి చెందిన 7 ఏళ్ల బాలిక 2023 ఆగస్టు 13 న ఇంటి బయట అడుకుంటున్న చిన్నారిపై సత్తుపల్లిమండలం, కొత్తూరు గ్రామానికి చెందిన మామిడి పాపారావు బాధిత బాలికపై లైంగిక దాడికి పాల్పడటంతో అమె ఏడుస్తూ తీవ్ర భయాందోళనకు గురై ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు జరిగిన విషయాన్నిచెప్పడంతో 2023 ఆగస్టు 13న స్థానిక సత్తుపల్లి పోలీస్ స్టేషన్ లో బాలికతల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు పూర్వాప రాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయ మూర్తి నిందితులపై మోపిన నేరం రుజువు కావడంతో తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు ప్రాసిక్యూటర్ మహ్మద్ వాదించారు. విచారణ అధికారులు. అప్పటి ఏసీపీ రామానుజం, ప్రస్తుత ఏసీపీ రఘు, ఇన్స్పెక్టర్, భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.ఉమా రాణి,కోర్టు కానిస్టేబుల్.రవి కుమార్ , కోర్టు లైజనింగ్ ఆఫీసర్, శ్రీకాంత్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## వాకీటాకీలతో శానిటరీ పర్యవేక్షణ బలోపేతం

**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నగరంలోని అరవై డివిజన్లకు చెందిన శానిటరీ జవాన్లకు వాకీటాకీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పాల్గొని ప్రతీ జవాన్‌కు వాకీటాకీ పరికరాన్ని అందించారు. ఈ వాకీటాకీల వలన ప్రతి జవాన్ ఎక్కడ పనిచేస్తున్నాడు, ఎప్పుడు హాజరయ్యాడు, ఏ ప్రాంతాన్ని శుభ్రం చేశాడు అనే సమాచారం తక్షణంగా తెలుసుకోవచ్చు. దీని ద్వారా శానిటేషన్ పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరగనుందని అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారి మాట్లాడుతూ %–% "ప్రతి జవాన్ పనితీరును నిఖార్సుగా గమనించేందుకు ఈ వాకీటాకీలు ఎంతో ఉపయోగపడతాయి. సమయపాలన మెరుగవుతుంది. అందరూ ఈ పరికరాలను జాగ్రత్తగా, బాధ్యతగా వినియోగించాలి" అని సూచించారు. ఈ సాంకేతిక పరికరాల వినియోగంతో శానిటేషన్ సేవల నాణ్యత పెరగడం ద్వారా ప్రజలకు మెరుగైన పరిశుభ్రత అందించే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# జూలై 9 న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**ఖమ్మం, మహా:** జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన ప్రజాసంఘాల ఐక్యవేదిక సమావేశం సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పాల్గొని మాట్లాడుతూ మోడీ పాలనలో గత 10 ఏళ్ళుగా స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్లను తెచ్చారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పొడిగించేందుకు, పని భారం పెంచేందుకు శ్రీకారం చుట్టారని యూనియన్లు పెట్టుకునే హక్కును నిరాకరిస్తున్నారని కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలివ్వాలన్న చట్టబద్ధ ఆదేశాలను, న్యాయస్థానాల తీర్పులను బుట్టదాఖలు చేస్తున్నారని వారు విమర్శించారు. కార్మిక సంక్షేమం, సాంఘిక భద్రత, ఉపాధి, ఉద్యోగ రక్షణ లేకుండా పోతున్నాయి. దేశంలో నయా ఉదారవాద విధానాలు, సంస్కరణల అమలు వల్ల ఆర్థిక అసమానతలు తీవ్రమౌతున్నాయి. ఆర్థిక మాంద్యం మరింత ఉధృతం అవుతుంది. ఉపాధి కల్పన స్థంబించి నిరుద్యోగం పెరిగింది. సంపద కొద్దిమంది సంపన్నుల వద్ద పోగుపడుతుంది. సంపద 40 శాతానికి పైగా 1శాతం సంపన్నుల వశం అవుతుంది. ఒక్క సంవత్సరంలోనే శతకోటీశ్వరుల సంఖ్య 102 మంది నుండి 166 మందికి పెరిగిందని వారు పేర్కొన్నారు. దీనికి భిన్నంగా 23 కోట్ల మంది ప్రజలు ఆకలి,దారిద్ర్యంలోకి దిగజారారు. కార్మికవర్గంతో పాటు రైతు – వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజలు సైతం దోపిడీకి గురౌతున్నారు. దీంతోపాటు పాలక వర్గాలు కులం, మతం, ప్రాంతం, లింగం, జాతి, భాష తదితర భావోద్వేగాలను ఉపయోగించుకుంటూ కార్మిక వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ ఆర్థిక ప్రయోజనాలతో పాటు రాజకీయ ప్రయోజనం కూడా పొందుతున్నారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల వాటాల విక్రయంతో పాటు ఆ సంస్థల మిగులు భూములను అమ్మడానికి బరితెగించింది. ఉద్యోగుల భవిష్యనిధి (పి.ఎఫ్) పై వడ్డీ తగ్గించాలనే ప్రతిపాదనలు చేసింది. పి.ఎఫ్ నిధులతో సహాఇన్సూరెన్స్, బ్యాంకింగ్ లలో వాటాలను షేర్ మార్కెట్లో పెట్టి ఆదానీ లాంటి కార్పొరేట్లుకు లబ్ధిచేకూరేలా నిర్ణయించింది. విలువైన జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్లు, రైళ్ళు, స్టేషన్లు, గ్యాస్ పైపైన్లు తన అనుయాయులకు కట్టబెడుతూ దేశ సంపదను లూఠీ చేస్తున్నది.మోడీ ప్రభుత్వ కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాల వల్ల కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బ తింటున్నాయని దేశ రైతాంగం ఏడాదికి పైగా చేసిన సమరశీల పోరాట ధాటికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం 3 వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి సంవత్సరం దాటింది. అయినా దొడ్డి దారిన అవే విధానాలను ఏకపక్షంగా అమలు చేస్తున్నది. విదేశీ, స్వదేశీ బహుళజాతి సంస్థల





ప్రయోజనాల కోసం కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్నది. దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ మోడీ సర్కారుకు పట్టడం లేదు. పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తీవ్ర సమస్యలుగా దేశ ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. దేశంలో బిజెపి పాలన అధ్వాన్నంగా తయారైంది. ప్రపంచ దేశాల ముందు భారతదేశ ప్రతిష్ట మంటగలిసిపోతున్నా స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్నదని ఈ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరావు ఐద్వారాష్ట్ర నాయకులు బుగ్గవీటి సరళ,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ బొంతు రాంబాబు సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్ ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు రమణ బండి పద్మ వ్యసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగుసత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్. బషీరుద్దీన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీ. ప్రవీణ్, పి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

FOLLOW: @ANNTELUGU
5-7-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక

# సిద్దు బాయ్ మాటే శాసనం!

**ఖమ్మం, మహా:** పట్టాల పథకాల పేరిట పేదలకు ఇచ్చిన భూములు నేడు అధికార, రాజకీయ గద్దల కింద పడిపోయి, 'ప్లాట్ పాపాల' నిలయంగా మారిన ఖమ్మం నగర శివార్లలోని పువ్వాడ ఉదయ్‌నగర్ ఉదంతం – సమకాలీన ప్రజాస్వామ్యంలో భయపెంచే నిజం. ఒకపక్క పేద ప్రజలు తమ హక్కుల కోసం నిలబడితే – మరోపక్క రాజకీయ నేతలు, అధికారిక ముఠాలు పక్కదారి పట్టించి కోట్లు మాయ చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, పట్టాలు, ఇళ్ల పంపకాలు, రిజిస్ట్రేషన్ మాయాలు, బినామీల సంపాదనలు, మీడియా మౌన వాహనత్వం, అధికారుల కలయిక – అన్నీ కలిసి ఒక్క గ్రామాన్ని నేరాల వేదికగా మార్చాయి. ప్రశ్నిస్తే దాడులు... నిజాలు వెలికి తీయాలంటే ప్రాణాల బెదిరింపులు –ఇక్కడి ప్రజలు ఇప్పుడు జీవిస్తున్నది ప్రజాస్వామ్యంలో కాదు... కుట్రాస్వామ్యంలో అని చెప్పవచ్చు.




### సర్వే నెంబర్ 192లో అసైన్డ్ భూముల్లో వేసిన నకిలీ పునాది!

2008లో కోయచెలక రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 192లో ఏర్పడిన పువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీ... 2009లో పట్టాల పంపిణీ, 2018లో పంచాయతీగా ఆవిర్భవించింది. సుమారు 2000 ఇళ్లకు ప్రభుత్వ పట్టాలు ఇచ్చినట్టు చెప్పబడినా... వాటిలో అనేకులు ప్లాట్ రూపంలో అమ్ముడై, రిజిస్ట్రేషన్ల మాయలో ప్రజల జీవితాలను మింగేశాయి.

### ఒక్కో ప్లాట్ రెండు సార్లు - మూడుసార్లు అమ్ముడవుతున్న పంచాయతీ పోరాటం.

ప్రభుత్వ పట్టాలు ఉన్న చోట... అధికారులు, స్థానిక నాయకులు కలసుకొని ఒకే ప్లాట్‌ను రెండు నుంచి మూడు సార్లు అమ్మే ఘాతుకాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్క ప్లాట్‌కు రూ. 2 లక్షల నుంచి రూ. 6 లక్షల దాకా ధర పెట్టి –అసైన్డ్ భూమిని కార్పొరేట్ కమర్షియల్ టౌన్‌షిప్‌లా మార్చిన దుర్ఘటన ఇది. ఫలితంగా అధికారికంగా ఇప్పటివరకు కేవలం 515 ఇళ్లకే పన్ను చెల్లింపులు జరుగుతున్నాయి. మొత్తం వసూలు రూ. 2,35,551 మాత్రమే.

### ప్రజల కన్నీటి మీద పెంచిన విల్లాలు - కుక్కల విలువ లక్షలు!

ఒకప్పుడు సెంట్రింగ్ పనులు చేస్తూ జీవించిన ఓ మాజీ సర్పంచ్ భర్త – నేడు విలాసవంతమైన రెండు అంతస్తుల బంగ్లా, సియాజ్ కారు, లక్షల విలువ చేసే బ్రీడ్ కుక్కలతో జీవనం గడుపుతున్న వైనం నిజానికి ప్రజల కడుపునీ కల్లోలపరిచే విషాదం. ఇవన్నీ బినామీల పేరిట రిజిస్ట్రేషన్‌లు, ఖమ్మం–హైదరాబాద్ రహదారిపై ఇళ్ల కొనుగోళ్లు, మమత ఆసుపత్రి పక్కన ఖరీదైన ప్రాపర్టీలు, ఫంక్షన్ హాల్స్ ద్వారా ధన ప్రదర్శనగా మారాయి.

### బినామీలు బజారులో - ఒక సర్కారు రికార్డుల్లో పేద, మరొకటిలో కోటీశ్వరుడు!

ముదిగొండ మండలం మేడిపల్లి నుంచి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ నాయకుడు – గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వంలోనూ నకిలీ విక్రయాలు చేసి, ఇప్పుడు కాంగ్రెస్‌లోనూ అదే చరిత్రను కొనసాగిస్తున్న వైనం ప్రజలను భయపెడుతున్నది. ఖమ్మం చుట్టూ విల్లాలు, స్కార్పియో కార్లు, విలాసాల మధ్య తిరిగే వాడు ఒకప్పుడు గంజాయి, మద్యం ముఠాలో ఉండేవాడన్నది చక్కటి రాజకీయ దొంగతనానికి నిదర్శనం.

### సిద్ధుభాయ్ ముఠా.. దాడులు, బెదిరింపులు -

ప్రస్తుతం పువ్వాడ ఉదయ్‌నగర్‌ను శాసిస్తున్న సిద్ధుభాయ్ అనే నేత "తుమ్మల గారి మనిషిని... నన్నెవ్వడు ఏమీ చేయలేడు" అంటూ బహిరంగంగానే గర్జిస్తున్నాడు. అతని భీకర వాక్యాల వెనుక యుగంధర్ అనే రాజకీయ వారసుని అండ ఉందంటూ ఆత్మవిశ్వాసంతో తిరుగుతున్నాడు. ప్రశ్నించే వారిని భౌతికంగా దాడి చేసి, ఇళ్లకు విద్యుత్ తీగలు అమర్చే ఘాతుకాలకు కూడా పాల్పడుతున్నాడన్నది స్థానికుల వేదన.



### అధికారుల అండ..

ఇన్ని అక్రమాలు జరుగుతున్నా - మొత్తం ఖమ్మం మీడియా ఈ విషయాన్ని పట్టించుకోకుండా వ్యవహరిస్తుండడంపై ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. గతంలో సదరు అక్రమాలపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బదిలీ చేసిన ఓ రెవెన్యూ ఉద్యోగి - లక్షలు ఖర్చుపెట్టి మళ్లీ అదే ప్రాంతానికి చేరి మరోసారి నేరాలకు అడ్డుకావడం... ఇది నిజంగా భయంకర తంతు. ఇంటి పన్ను వసూలు, పట్టాల నమోదు కోసం లంచాలు తప్పవన్న వాస్తవాన్ని స్వయంగా అధికారులు ఒప్పుకుంటే - అప్పుడు ప్రజల ఆశల పాదయాత్ర ఎటు? పువ్వాడ ఉదయ్‌నగర్‌పై విచారణలు ఎందరో అధికారి లెవెల్‌లో జరిగాయి. కానీ... చర్యలు మాత్రం శూన్యమే. నేటికీ అదే ముఠా, అదే దోపిడీ, అదే దండగలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉన్నతాధికారులు, ఏసీబీ , జిల్లా కలెక్టర్, రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ విభాగాలు -కలసి ఈ దొంగతనాలపై సాక్షాత్కార విచారణ చేపట్టి, అక్రమ సంపాదనలపై చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

### ఇళ్ల పంపకాల్లో రూ. 50 వేలు వసూలు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 129 మంది లబ్ధిదారులకు పంపిణీ జరగాల్సి ఉండగా - వాటిలో ఒక్కో ఇంటికి రూ. 50 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పథకం పేరిట వచ్చిన బడ్జెట్ ప్రజల్ని చేరకుండా మధ్యలోనే మాయమవుతున్న వైనం... తక్కువలో తక్కువ ప్రజాస్వామ్యం మీద నమ్మకం కోల్పోయేలా చేస్తోంది.



# అధిక వర్షాల సమయంలో ప్రత్తి పంటలో జాగ్రత్తలు తీసుకోండి

**కూసుమంచి, జులై 4, మహా:** గత 3–4 రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రత్తి పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని అగ్రికల్చర్ ఏఓ రామడుగు వాణి అన్నారు. శుక్రవారం కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో అగ్రికల్చర్ అధికారులు పత్తి పంటలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో అధిక వర్షాలకు వల్ల ప్రత్తి పంటను కాపాడుటకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల్లో ముఖ్యంగా నీటిని సాధ్యమైనంత త్వరగా తీసివేయాలి. వీలైనంత త్వరగా భూమిలో తేమను తగ్గించడానికి అంతర కృషి చేయాలి . దీని ద్వారా భూమిలో తేమ తగ్గి మొక్కలు సాధారణ స్థాయికి చేరుకుంటాయి. ప్రత్తి విత్తుకొని 20– 25 రోజులు దశలో ఉన్న పంటకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు 5 – 7 సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంతర సేద్యం సాధ్యం కానిచో 20 - 25 రోజుల దశలో ప్రొపక్విజలోఫాప్ 10% %జుజ% 250 మిల్లీలీటర్లు, పైరీ థియోబాక్ సోడియం 250 మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారి చేయడం ద్వారా గడ్డి జాతి, వెడల్పాటి కలుపును నివారించవచ్చు. అధిక వర్షాలకు నల్ల నేలల్లో వేరు కుళ్ళు తెగులు ఆశించే అవకాశాలు ఉన్నాయి. వేరు కుళ్ళును గమనించిన వెంటనే కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండజిమ్ 1 గ్రా. లీటర్ నీటి కలిపి మొక్క మొదళ్ళ లో తడపాలి. అధిక వర్షాలకు లేత పసుపు రంగుకు మారిన మొక్కలకు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే మొక్కలు సాధారణ స్థితికి చేరతాయి.

# ఘోర రోడ్డు ప్రమాదం



**ఖమ్మం క్రైమ్, మహా:** ఖమ్మం–వరంగల్ హైవేపై తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాలను శోకసాగరంలో ముంచింది. అర్ధరాత్రి నిద్రను భంగం చేస్తూ ఆ రోడ్డుపై ఒక్కసారిగా అగ్నికీలలు చెలరేగాయి. భారీ వేగంతో దూసుకొచ్చిన రెండు లారీలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. వారిలో ఇద్దరు లారీ డ్రైవర్లు కాగా, ఒకరు క్లీనర్. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య తాడాడుతున్నారు. మంటలు ఆ ప్రాంతాన్ని కమ్ముకోవడంతో స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరిపెడ శివారులో కుడియాతండా వద్ద శుక్రవారం దారుణ రోడ్డు ప్రమాదం సంభవించింది. వరంగల్ వైపు నుండి వస్తున్న లారీని ఖమ్మం వైపు నుంచి వస్తున్న మరో లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే రెండు వాహనాల క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. ఒకే సమయంలో మంటలు ఎగసిపడటంతో ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్ అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తించడానికి వీలు లేకుండా పోయాయి. ప్రమాద సమయంలో రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ఒక్కసారిగా ఆగిపోయారు. తక్షణమే ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వగా, ఖమ్మం నుండి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను శ్రమపడి ఆర్పేశారు. గాయపడిన మరొకరిని తక్షణమే ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన వాహనాల వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, రాత్రి దృష్టిస్థిమితం తక్కువగా ఉండటం వంటి అంశాలపై విచారణ సాగిస్తున్నారు. మృతుల వివరాలు ఇంకా గుర్తించాల్సి ఉంది. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.